పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# ఏప్రిల్ మొదటి వారంలో జువ్వలదిన్నెకు జగన్మోహన్ రెడ్డి రాక

## మత్స్యకారులకు భరోసా కల్పించనున్న జగన్





కావలి ఆర్సి ఇంచార్జ్ పెన్ పవర్ మార్చ్ 26 కావలి నియోజకవర్గం జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ ను పరిశీలించి, మత్స్యకారుల సమస్యలు తెలుసుకుని అండగా నిలిచేందుకు ఏప్రిల్ మొదటి వారంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి జువ్వల దిన్నె కు వస్తున్నట్లు వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన హెలిప్యాడ్ కు అనువైన స్థలం గుర్తించడంతోపాటు, అవసరమైన ఏర్పాట్లు చేపట్టేందుకు మాజీ ఎమ్మెల్యే రామి రెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో, శాసనమండలి సభ్యులు తలశిల రఘురాం, పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మత్స్యకారులు, స్థానిక నాయకులతో కలిసి జువ్వలదిన్నెలో పర్యటించారు. ఈ సందర్భంగా వారికి దారి పొడవునా స్థానిక వైస్సార్ సిపి పార్టీ శ్రేణులు పూల మాలలు బొకేలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాకాని గోవర్ధన్ రెడ్డి, రామ్ రెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిలు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మత్స్యకారుల కోసం ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి 289 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి, శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. దశాబ్దాలుగా ఫిషింగ్ హార్బర్ కోసం ఎదురుచూస్తున్న మత్స్యకారుల కల జగన్మోహన్ రెడ్డి తో సాకారం అయ్యిందన్నారు. 2024 మార్చి కల్లా ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తయ్యాయి అని,జగన్మోహన్ రెడ్డి స్వయంగా వచ్చి ప్రారంభించాలని అనుకున్నారని తెలిపారు. ఇంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి చేత 2024 ఆగస్టు లో వర్చువల్ గా ప్రారంభోత్సవం చేసినట్లు తెలిపారు– ఇటీవల స్థానిక ఎమ్మెల్యే జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ ను మేమే కట్టాం అని కలెక్టరేట్ లో కూర్చుని మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. చంద్రబాబుకు, టీడీపీ ఎమ్మెల్యేల కు ఇతరులు చేసిన పనులు తాము చేసినట్లు చెప్పుకోవడం, అలవాటైపోయింది అన్నారు. జగన్మోహన్ రెడ్డి మత్స్యకారుల కోసం ఆలోచించి 79 ఎకరాల్లో 289 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన ఫిషింగ్ హార్బర్ ను తెలుగుదేశం పార్టీ 29.5 ఎకరాలతోపాటు సముద్ర తీర ప్రాంతంలో కూడా కొంత ప్రాంతాన్ని సాగర్ డిఫెన్స్ కు అప్పజెప్పి మత్స్యకారులకు అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ను ప్రైవేటు వ్యక్తులకు ఇస్తే మత్స్యకారులు అనేక ఇబ్బందులు పడతారన్నారు. మత్స్యకారులు ఫిషింగ్ హార్బర్ కు రావాలంటే ప్రైవేట్ సంస్థ అనుమతి తీసుకోవాలి, వారు జారీచేసిన గుర్తింపు కార్డులు చూపించి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది అని తెలిపారు. తమ కలలను సాకారం చేసుకుని ఆనందంలో ఉన్న 25 వేల మత్స్యకార కుటుంబాల జీవితాల్లో చంద్రబాబు, కుటుమి నాయకులు, వారి ఆశలపై నీళ్లు చల్లుతూ ప్రైవేటీకరణకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ఈ ప్రాంత మత్స్యకారుల ఆస్తి, హక్కు అన్నారు. మత్స్యకారులు ప్రాణాలకు తెగించి నాలుగు బోట్లు పట్టుకొని పోలీసులకు అప్పగించారు అన్నారు. కావలి పోలీస్ స్టేషన్ లో రెండు ఎఫ్ ఐ ఆర్ లు , బోగోలు పోలీస్ స్టేషన్ లో రెండు ఎఫ్ ఐ ఆర్ లు,బోట్లు రిజిస్ట్రేషన్ నంబర్లతో సహా నమోదు చేశారని తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి, రాష్ట్రాలకు చెందిన మత్స్యకారులు మన తీరంలోకి వచ్చి 500 మీటర్ల లోపల వేట సాగించారని, చేపల వలలు తెంపివేసి బోట్లు ధ్వంసం చేశారని మత్స్యశాఖ అధికారులు వేరు, వేరుగా రెండు కేసులు పెట్టినట్లు వివరించారు. మత్స్యకారులు ప్రాణాలకు తెగించి పట్టుకున్న బోట్లను లోకేష్ వస్తున్నాడని బోట్లను పక్కన పెట్టాలని పోలీసులు చెప్పి , వాటికి మరమ్మత్తులు చేసి రాత్రికి, రాత్రే తరలించేశారని తెలిపారు. కారులో వచ్చే లోకేష్ కు సముద్రం లో ఉన్న బోట్లతో ఏమి పనుంది అన్నారు. మత్స్యకారులు ప్రాణాలకు తెగించి పట్టుకున్న బోట్లు పంపించివేసిన కూటమి నాయకులు, ఏమి తెలియనట్లు మరొకసారి ఇలా జరిగితే వారి అంతు చూస్తామని హాస్యాస్పదం గా మాట్లాడుతున్నారు అని ఎద్దేవా చేశారు. మీరే బోట్లను పంపించి వేసి ,మళ్లీ ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామని మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. కూటమి నాయకులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా , దొడ్డి దారిన పంపించి వేసిన బోట్లను తిరిగి వెనకకు తీసుకురావాలి అని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు జగన్మోహన్ రెడ్డి గారు ఇచ్చిన ఆస్తి ఫిషింగ్ హార్బర్ ను ప్రవేట్ పరం చేస్తామంటే చూస్తూ ఊరుకోము అన్నారు. కూటమి నాయకులు చేసేఅవినీతి, అక్రమాలకు మత్స్యకారులను బలి చేయవద్దని హితవు పలుకుతున్నట్లు తెలిపారు. మత్స్యకారులకు కూటమి నాయకులు చేసిన ద్రోహాన్ని తెలుసుకొని జగన్మోహన్ రెడ్డి గారు ఆవేదన చెందారు అని వెల్లడించారు. అధికారం ఉన్నా, లేకపోయినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

# అక్కుర్తి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి 90 రోజుల గడువు -- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన నేత







శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, మార్చి,26 : అక్కుర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఈరోజు సందర్శించి, అక్కడి విద్యా వాతావరణాన్ని సమగ్రంగా పరిశీలించారు. పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలను స్వయంగా తనిఖీ చేసి, విద్యార్థులతో స్నేహపూర్వకంగా మమేకమై వారి చదువుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కాసేపు సరదాగా గడిపి వారికి ప్రోత్సాహం అందించారు. అనంతరం, 'డొక్కా సీతమ్మ' మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి, పథకం అమలు విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయడం ద్వారా వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలిగిందని తెలిపారు. ఈ సందర్భంగా, పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, రాబోయే విద్యా సంవత్సరం నాటికి పలు అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 90 రోజుల గడువు నిర్ణయించి, వచ్చే అకడమిక్ ఇయర్ ప్రారంభానికి ముందు పాఠశాలలో ఆర్.ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడం, అదనపు తరగతి గదులను నిర్మించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం తమ ప్రాధాన్యతగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

# మార్కాపురం బస్సు ప్రమాదం మృతులకు సంతాపం తెలిపిన తలపా దామోదరం రెడ్డి



శ్రీకాళహస్తి ,పెన్ పవర్, మార్చి 26, మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో జరిగిన దురదృష్టకర బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ల ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని కోరారు. అలాగే గాయపడిన వారికి ఉత్తమ వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీతో పాటు మునికృష్ణయ్య, మహేష్, భరణి, జోసెఫ్, నాగరాజు, కృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు.

# జగన్ రెడ్డి పై టిడిపి నేతల తీవ్ర విమర్శలు



శ్రీకాళహస్తి , పెన్ పవర్, మార్చి, 26: వైసీపీ అధినేత జగన్ రెడ్డి చెప్పే మాటలకు చేసే పనులకు ఏమాత్రం పొంతన లేదని, అధికారం కోసం అతి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా. జి. దశరథాచారి మరియు వన్నెకుల క్షత్రియ సంక్షేమం ఉ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి తీవ్ర స్థాయిలో విమర్శించారు. జగన్ రెడ్డి రాజకీయాల్లో ఊసరవెల్లితో పోటీ పడుతున్నాడని వారు ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి, ప్రతిష్టలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తుండగా, ఆయనపై జగన్ రెడ్డి చౌకబారు విమర్శలు చేయడం బాధాకరమని ఖండించారు. గత ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుని, రాష్ట్ర ప్రగతిని ప్రశ్నార్థకంగా మార్చారని ఆరోపించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో కృషి చేస్తుంటే, వాటిని తన కృషిగా చెప్పుకోవడం జగన్ రెడ్డి వైఖరి అని విమర్శించారు. రాజధాని అంశంలో జగన్ రెడ్డి ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదని, ప్రతి ఏడాది ఒక కొత్త ప్రకటన చేస్తూ అమరావతికి అడ్డుపడినట్లు ఆరోపించారు. కనీసం 2026లో అయినా రాజధాని పై స్పష్టమైన విధానం ప్రకటించాలని, అవసరమైతే ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో వివరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డా. జి. దశరథాచారి, మిన్నల్ రవి, యం. సుబ్బయ్య, డా. యం. ఉమేష్ రావు, బీమాల భాస్కర్ ముదిరాజ్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, గంగనపల్లి రమేష్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి సిఎంఆర్ఎఫ్ సహాయం -- ఇంటి వద్దకే చెక్కు అందజేసిన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



తొట్టంబేడు, పెన్ పవర్, మార్చి, 26 : శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తొట్టంబేడు మండలం ఇలగనూరు గ్రామానికి చెందిన పెద్ద సుబ్రమణ్యం కి ముఖ్యమంత్రి సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని నేడు వారి నివాసానికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడికి రూ. 54,258 విలువైన చెక్కును ఎమ్మెల్యే స్వయంగా అందజేసి, వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కష్టకాలంలో ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సహాయం అందుకోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# ముచ్చివోలు రామాలయ కమిటీ నుంచి బిజెపి మండల అధ్యక్షుడు వెంకటేష్‌కు ఘన సన్మానం



శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, మార్చి 26 : శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని ముచ్చువోలు గ్రామంలో వెలసిన శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ సీతారామ ఆలయ కమిటీ సభ్యులు బిజెపి మండల అధ్యక్షుడు బాగిర్తి వెంకటేష్‌ను ఘనంగా సత్కరించారు. ముచ్చువోలు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రారంభోత్సవం మరియు కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలను పాల్గొనాలని వెంకటేష్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా, ఆలయ కార్యక్రమాల్లో స్వయంగా చురుగ్గా పాల్గొని సేవలందించారు. ఈ సేవలను గుర్తించిన ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్‌ను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు మొక్కపాటి వెంకట్రామనాయుడు, బొక్కిసం రామయ్య, ఎర్రం నాయుడు, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో బలిజ భవనం నిర్మాణానికి జర్నలిస్టుల విరాళం



శ్రీకాళహస్తి,పెన్ పవర్, మార్చి 26 : శ్రీకాళహస్తి పట్టణంలో బలిజ సోదరులు నిర్మిస్తున్న బలిజ భవనం నిర్మాణానికి స్థానిక ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా ప్రముఖ జర్నలిస్టులు పోలూరు హరీష్ రాయల్, బి. చంద్రశేఖర్, సి. వేణుగోపాల్ లు భవనం నిర్మాణానికి విరాళాలను అందజేశారు. పోలూరు శేషు (సింగపూర్) మరియు పద్మావతమ్మ (రిటైర్డ్ టీచర్) కుమారుడైన పోలూరు హరీష్ రాయల్ మాట్లాడుతూ, సమాజాభివృద్ధికి ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. బలిజ సమాజ ఐక్యతకు ఈ నిర్మాణం ఒక ప్రతీకగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బలిజ భవనం నిర్మాణానికి కృషి చేస్తున్న బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ నాయకుడు ముత్యాల పార్థసారధి లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దాతలు బలిజ భవనం నిర్మాణానికి విరాళాలు అందజేస్తూ సమాజ సేవలో భాగస్వాములయ్యారు.

# తక్షణమే బాధితులకు ప్రభుత్వం ఇల్లు నిర్మించాలి..

## ఎమ్మెల్యే తన సొంత నిధులతోనైనా బాధితులను ఆదుకోవాలి..

## కోవూరు వైసిపి నాయకుల డిమాండ్..

## బాధితులకు మద్దతుగా నిరసన..





కోవూరు పెన్ పవర్ మార్చి 26. కోవూరు స్టవ్ బిడి కాలనీ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న నివాసాలను కూల్చివేసిన బాధితులకు ప్రభుత్వం వెంటనే ఇల్లు నిర్మించాలని కోవూరు వైసిపి మండల అధ్యక్షులు అనుప్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం బాధితులకు మద్దతుగా వైసిపి నేతలతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా నోటీసులు ఇవ్వకుండా ఇల్లులు కూల్చివేయడం దారుణం అన్నారు. గత 40ఏళ్ల నుండి వారు నివాసం ఉంటూ కరెంటు బిల్లులు కులాయి పనులు చెల్లిస్తున్న వారికి ఇలా చేయటం సరి కాదన్నారు. నిన్నటి నుండి రోడ్డుపై మహిళలు నిరసన చేస్తుంటే అధికారులు స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే తన సొంత నిధులతోనైనా వారికి ఇల్లు నిర్మించాలన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో వరదలు వచ్చి ఇబ్బంది పడుతుంటే నల్లపురెడ్డి ప్రసన్నకుమారెడ్డి తన సొంత నిధులతో వారికి ఇల్లు నిర్మించడం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ గారిని పరామర్శించిన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి ఆర్సి ఇన్చార్జ్ పెన్ పవర్ మార్చ్ 26 ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ గారు ఇటీవల మాతృ వియోగం చెందారు. కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి గారు గురువారం నెల్లూరులోని అజీజ్ గారి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గ ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ అల్ హర్, టీడీపీ నాయకులు రేబాల శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# మాతా వైష్ణోదేవి అమ్మవారికి ఎంపీ వేమిరెడ్డి దంపతుల వాహనాల అందజేత



నెల్లూరు పెన్ పవర్ మార్చి 26. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు జమ్మూ లోని కట్రా లో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మాతా వైష్ణో దేవి అమ్మవారికి రెండు వాహనాలను విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో వివిధ అవసరాల నిమిత్తం అధికారులకు రెండు వాహనాలు అందజేశారు.

# మత్స్యకారులకు జగనన్న భరోసా. కాకాణి





నెల్లూరు పెన్ పవర్ మార్చి 26. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా,కావలి నియోజకవర్గం, జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ ను పరిశీలించి, మత్స్యకారుల సమస్యలు తెలుసుకుని అండగా నిలిచేందుకు ఏప్రిల్ మొదటి వారంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి జువ్వల దిన్నె రానున్న సందర్భంగా హెలిప్యాడ్ కు అనువైన స్థలం గుర్తించడంతోపాటు, అవసరమైన ఏర్పాట్లు చేపట్టేందుకు మాజీ శాసనసభ్యులకు రామి రెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో, శాసనమండలి సభ్యులు తలశిల రఘురాం పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మత్స్యకారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి జువ్వలదిన్నె కు బయలుదేరిన రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాజీ మంత్రి కాకాణి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి దారిపొడవునా శాలువాలు, బొకేలతో ఘన స్వాగతం పలికిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మన ప్రియతమ నేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏప్రిల్ మొదటి వారంలో నెల్లూరు పర్యటనకు వస్తున్నారని వెల్లడించిన కాకాణి జగన్మోహన్ రెడ్డి జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ ను పరిశీలించి మత్స్యకారుల సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్న కాకాణి మత్స్యకారులకు, మత్స్యకార కుటుంబాలకు జరుగుతున్న అన్యాయాలను తెలుసుకునేందుకు జగన్మోహన్ రెడ్డి జువ్వల దిన్నెకు రానున్నారన్న కాకాణి మత్స్యకారులతో మమేకమై వారితో ముఖాముఖి అనంతరం జగన్మోహన్ రెడ్డి పూర్తి స్థాయి భరోసా కల్పించనున్నారన్న కాకాణి

# ఎల్పిజి స్థానంలో పిఎన్జి తప్పనిసరి



కడప. పెన్ పవర్, మార్చి, 26: పిఎన్జి (పైప్డ్ నేచరల్ గ్యాస్) అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఉన్న వారు కచ్చితంగా ఎల్పిజికి బదులుగా పిఎన్జి వినియోగానికి బదిలీ కావాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వినియోగదారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సివిల్ సప్లరు శాఖ ఆధ్వర్యంలో పిఎన్జి వినియోగంపై అవగాహన పెంచేందుకు కో -- ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్‌తోపాటు జెసి డాక్టర్ నిధీమీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో వంట గ్యాస్ కొరత కొనసాగుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసు కుందన్నారు. ఆ మేరకు పిఎన్జి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఉన్న వారు కచ్చితంగా మారిపోవాల్సి ఉంటుందని, వారందరికీ త్వరలో ఎల్పిజి గ్యాస్ సరఫరా ఆగిపోనుందనే విషయాన్ని కూడా తెలియజేసారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా భారత్‌లో ఎల్పిజి గ్యాస్ కొరత ఏర్పడిన సంగతి తెలిసిందేనని, ప్రస్తుతం పరిస్థితులు అదుపులోనే ఉన్నా ఈ కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఇకపై పైప్డ్ నేచరల్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని కుటుంబాలకు ఎల్పిజి గ్యాస్ డెలివరీని నిలిపివేయనున్నట్లు తెలిపిందన్నారు. పిఎన్జి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఆ కనెక్షన్‌కు మారాలని స్పష్టం చేసిం దన్నారు. అందుకు కొంత సమయం కూడా గడువు ఇస్తున్నట్లు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. పిఎన్జికి మారడం ద్వారా గ్యాస్ సిలిండర్ల రీఫిల్స్ బుకింగ్ చేసే అవసరం తొలగిపోతుందని చెప్పారు. ఏదైనా టెక్నికల్ ఇష్యూ వల్ల ఇంటికి పైపు లైన్ కనెక్షన్ ఇవ్వడం సాధ్యం కాని సందర్భంలో మాత్రమే ఎల్పిజి సరఫరా కొనసాగుతుందని వెల్లడించారు. జెసి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పారిశ్రామిక యూనిట్లలో ఆరెంజ్ రెడ్ జోన్లలో ఉన్న యూనిట్లు తప్పనిసరిగా పిఎన్జి వాడకాన్ని అమలు చేయాలని సూచించారు. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక జీవోను కూడా విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో కెఎంసి కమోషనర్ రాకేష్ చంద్రం, డిఎస్ఓ రఘురాం, పరిశ్రమల శాఖ, పొల్యూ అండ్ కంట్రోల్ బోర్డు, సివిల్ సప్లయి సంబంధిత శాఖల అధికారులు, హోటల్స్, పరిశ్రమలు, కమర్షియల్ సంస్థల నిర్వహకులు పాల్గొన్నారు.

# వి.కోటలో విజిలెన్స్ మరియు రెవెన్యూ దాడులు

## ఐదు సిలిండర్లు స్వాధీనం



పలమనేరు,పెన్ పవర్, మార్చి 26, నియోజకవర్గ పరిధి వి.కోట మండల కేంద్రంలో తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం, రెవెన్యూ శాఖల సంయుక్త సోదాల్లో గృహవినియోగానికి వాడాల్సిన ఐదు గ్యాస్ సిలిండర్లను హోటళ్లలో సీజ్ చేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ల డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని కొంతమంది గృహ వినియోగానికి వాడాల్సిన సిలిండర్లను అధిక ధరలతో హోటళ్లకు విక్రయిస్తున్నట్లు సమాచారంతో అధికారులు ఈ దాడులు నిర్వహించారు.దీనిపై వి.కోటలో రెండు చోట్ల సోదాలు నిర్వహించగా కుప్పం రోడ్లోని దాసార్లపల్లె వద్ద హోటళ్లలో రెండు సిలిండర్లు,వి.కోట ప్రభుత్వాసుపత్రి ఎదుట హోటల్లో మూడు సిలిండర్లను సీజ్ చేశారు.కాగా సీజ్ చేసిన సిలిండర్లను రెవిన్యూ అధికారులకు అప్పగించి వారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో తిరుపతి విజిలెన్స్ అధికారి రామాంజనేయులు రెవిన్యూ అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుందని విమర్శలు

అయితే అధికారులు చిన్న హోటళ్లపై గురువారం నిర్వహించిన దాడులను పలువురు వ్యాపారులు తప్పుబట్టారు.

40 రూపాయల మసాలాదోసను 80రూపాయలకు,

6 రూపాయల ఇడ్లీ పది రూపాయలు చేసిన పెద్ద పెద్ద హోటళ్లను వదిలేసి బోండా అంగళ్లు,చికెన్ పకోడి దుకాణాల లాంటి చిన్నవ్యాపారులపై అధికారులు ప్రతాపం చూడడం ఏంటని సామాన్యులు మండిపడుతున్నారు.

# దుర్ఘటనలో ఆగిపోయిన జీవితం... కుటుంబం కన్నీటి సముద్రంలో





పొదలకూరు పెన్ పవర్ మార్చి 26.జీవితాన్ని నిలబెట్టేందుకు బేల్దారి పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లిన ఓ కూలీ... తన గ్రామానికి తిరిగి వస్తూ అనుకోని విషాదానికి బలయ్యాడు. సంతోషంగా జరగాల్సిన శ్రీరామనవమి... ఆ కుటుంబానికి శోకసంద్రంగా మారింది.జగిత్యాల నుండి కనిగిరి వైపు వస్తున్న హరికృష్ణ ట్రావెల్స్ బస్సు, మార్కాపురం సమీపంలోని రాయవరం గ్రామం వద్ద అకస్మాత్తుగా అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో సుమారు 13 మంది వరకు సజీవదహనం అయినట్లు సమాచారం. పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు మృతుల గుర్తింపు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఒకరు ముత్తంగి వెంకటేశ్వర్లు. స్వగ్రామం ఉదయగిరి సమీపంలోని దాసరపల్లి. గత మూడు సంవత్సరాలుగా పొదలకూరు మండలం తోకంచి (వెంకటేశ్వర్ నగర్)లో నివసిస్తూ, కుటుంబాన్ని పోషించేందుకు కష్టపడుతున్న సాధారణ కూలీ.సంక్రాంతి తర్వాత జగిత్యాల జిల్లాకు బేల్దారి పనుల కోసం వెళ్లిన వెంకటేశ్వర్లు...గత సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా దేవుని పేరుతో తీసుకున్న డబ్బును తిరిగి ఇవ్వడానికి, ఈసారి పండుగకు ముందే స్వగ్రామానికి బయలుదేరాడు.కానీ... ఆ ప్రయాణమే అతని జీవితానికి చివరి ప్రయాణంగా మారింది.పామూరు వద్ద దిగి, అక్కడి నుంచి పొదలకూరు చేరుకోవాలని అనుకున్న వెంకటేశ్వర్లు...కనిగిరి వైపు వస్తున్న ఆ బస్సులో ఎక్కారు.అదే బస్సు అగ్నికి ఆహుతై... అతని ఆశలు, కలలు, బాధ్యతలు అన్నీ క్షణాల్లో బూడిదయ్యాయి.

# వైద్య కళాశాలలను వెంటనే ప్రారంభించాలి



పులివెందుల. పెన్ పవర్, మార్చి, 26:పులివెందులతో సహా రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న పది ప్రభుత్వ వైద్య కళాశాలలను త్వరలో పూర్తిచేసి ఈ విద్యా సంవత్సరం నుండే ప్రభుత్వ రంగంలో ప్రారంభించాలని, జగన్‌పై కక్షతో పేదలకు అన్యాయం చేయవద్దని అఖిలపక్ష పార్టీల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలను నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ పిపిపి విధానంలో వైద్య కళాశాలను నిర్మిస్తే రిజర్వేషన్లు అమలు కావని తెలిపారు. పేద విద్యార్థులు, ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోతారన్నారు. పేద రోగులకు వైద్యం ఉచితంగా లభించదని వివరిస్తూ ప్రభుత్వం వైద్య రంగంలో పిపిపి విధానానికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంలో వెనుకబడిన ప్రాంతాలలో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని ప్రయివేటీకరణ చేసి ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవడం జరిగిందన్నారు. పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి మాట్లాడుతూ పులివెందల, కడపపై చంద్రబాబు కక్ష కట్టడం శోచనీయన్నారు. రూ.150 కోట్లు విలువచేసే 50 ఎకరాల భూమిని, రూ.412 కోట్లతో నిర్మించిన భవనాలను ప్రయివేటుకు అప్పజెప్పాలనే ధోరణిని విడనాడాలని కోరారు. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న పది ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం 21 నెలలుగా ఏమాత్రం పట్టించుకోకపోవడం దుర దృష్టకరమని పేర్కొన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వివిధ ఈవెంట్ల పేర్లతో వేలాది రూ.కోట్లను మంచినీళ్లు ప్రాయంగా దుబార చేస్తున్నారని విమర్శించారు.

